కార్పొరేటర్ శ్వేతకు బండి సంజయ్ పరామర్శ

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డిని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం పరామర్శించారు. గత నెల 30న కార్పొరేటర్ తండ్రి బద్దం సుధాకర్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. బండి సంజయ్ సైదాబాద్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 21వ డివిజన్‌లో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ బంగారు అనితాప్రభాకర్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ నర్సింహరాజు, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, బాలకృష్ణ, సుభాన్‌యాదవ్, కుమార్, నరహరి గౌడ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ. 40లక్షలతో రత్నాకాలనీలో..

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రత్నాకాలనీలో స్థానిక కౌన్సిలర్ చెవుల హరిశంకర్‌ముదిరాజ్, కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్‌పర్సన్‌తో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కందాడ అనుపమానుప్రసేనారెడ్డి, డీఈఈ శివానంద, కాలనీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మధనాచారి, నర్సింహ, నర్సింహారావు, లక్ష్మణాచారి, కృష్ణగౌడ్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్, నందకుమార్, రజినీ, మంజుల, కల్పన, యాదమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలో..

చాదర్‌ఘాట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. సీసీ రోడ్డు నిర్మాణంతో సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని కార్పొరేటర్ వివరించారు. జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, ఎస్ఎఫ్ఏ గణేష్, స్థానికులు రాముయాదవ్, నారాయణ, శ్రవణ్‌కుమార్, రాఘవేంద్ర, అనిరుధ్, పవన్‌కుమార్, సందీప్ పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకువద్దాం: వెంకటేశ్‌గౌడ్

సరూర్‌నగర్ : ఏపీలో అధికారం దక్కించుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలంగాణలో పార్టీ పటిష్టతపై దృష్టి పెట్టారని ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంటరీ స్థానం కన్వీనర్ కె.వెంకటేశ్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వెంకటేశ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాఘవులు, రాజశేఖర్, జెనిగె కృష్ణయాదవ్, కొమురేశ్, నర్సింగ్‌యాదవ్, బాల్‌రాజ్, చంద్రునాయక్, రవీందర్‌చౌహాన్, రమేశ్‌యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

మార్నింగ్‌వాక్‌లో పౌరసమస్యలకు సత్వర పరిష్కారం

ఎల్బీనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మార్నింగ్‌వాక్‌లో తెలుసుకున్న పౌరసమస్యలకు సత్వర పరిష్కారం అందించడం జరుగుతుందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ చెప్పారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీలో అధికారులతో కలిసి శ్రీవాణిఅంజన్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు జీహెచ్ఎంసీ డీఈ చందన, ఇంజనీరింగ్ ఏఈ ప్రశాంతి, వెటర్నరీ అధికారి యాదగిరి, జలమండలి మేనేజర్ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ నరేష్, రాంకీ ప్రతినిధి భరత్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల అడ్డగింత

వనస్థలిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండు కాలనీలకు మాత్రమే సరిపోయే 400 డయా ఎంఎం పైప్‌లైన్‌తో గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిన్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లో 154 విల్లాలతో ఉన్న క్రిస్టియల్ విల్లాస్ డ్రైనేజీ పైప్‌లైన్‌ను తమ కాలనీ పైప్‌లైన్‌లో అక్రమంగా కలపడం సహించరానిదని గాయత్రినగర్ బ్యాంక్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం డ్రైనేజీ పైప్‌లైన్ పనులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. దుబాయ్ రాజు, సరస్వతి, భావన శ్రీనివాస్, భద్రారెడ్డి, మనోహర్, వెంకటరెడ్డి, రమేష్, దయాకర్ ముదిరాజ్, మనోజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

13న చంచల్‌గూడకు సీఎం రేవంత్‌రెడ్డి

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 13న చంచల్‌గూడ జైలుకు రానున్నారు. ఉదయం 10గంటలకు సీకా పరేడ్ గ్రౌండ్‌లో వార్డర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అనంతరం జైలు పెట్రోల్ బంకుతో పాటు జైలులో ఖైదీల కోసం ఏర్పాటు చేసిన రీ అడిక్షన్ కేంద్రాన్ని సీఎం ప్రారంభించనున్నారు. సీఎం రాక సందర్భంగా జైలు పరిసరాలను జీహెచ్ఎంసీ, జైళ్లశాఖ ముస్తాబు చేస్తుంది. జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల


ఇంటిని చిందరవందర చేసిన దొంగలు

హయత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉన్న నగదు, నగలను దొంగలు అపహరించుకొని ఉడాయించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కుంట్లూరు రవిశంకర్ కాలనీలో గణేష్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో బంధువులు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి దిన కార్యములకు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళాలు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో ఉన్న లక్ష రూపాయల నగదు, 50 తులాల వెండి, తులం బంగారు గొలుసు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించిన గణేష్ శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మటన్ దుకాణం ఏర్పాటు విషయంలో ఘర్షణ
కత్తులతో దాడి : ముగ్గురికి గాయాలు

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాంసం దుకాణం ఏర్పాటు విషయంలో జరిగిన వివాదం కత్తిపోట్లకు దారి తీసి ముగ్గురికి గాయాలయ్యాయి. చంచల్‌గూడలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా ఉన్న ఓ మడిగెలో ఒక వ్యక్తి మాంసం దుకాణాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఇందుకు స్థానికంగా ఉన్న మటన్ దుకాణం వ్యాపారి అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం చెలరేగింది. దీంతో ఇరువురు వ్యాపారులకు సంబంధించిన బంధువులు అక్కడికి చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు జోక్యంచేసుకొని ఇరు గ్రూపులను అక్కడి నుంచి పంపించి వేశారు. ఓ వ్యాపారికి చెందిన వ్యక్తులు కత్తులతో డబీర్‌పురా ఆర్‌ఓబీ పక్కనే ఉన్న హౌజ్దార్‌ఖాన్, జీమాన్‌ఖాన్ ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేసి ముగ్గురిని గాయపరిచారు. క్షతగాత్రులను మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు. మాదన్నపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని యువతిని
మోసం చేసిన యువకుడిపై కేసు

చాదర్‌ఘాట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిపై చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ శ్రీకాకుళం జిల్లాకు చెందిన 23ఏళ్ల యువతి ఓల్డ్‌మలక్‌పేటలో నివాసముంటుంది. ప్రైవేటు ఉద్యోగి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అనిల్(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ ఓల్డ్‌మలక్‌పేటలోని మున్సిపల్ కాలనీలో నివాసముంటున్నాడు. ఏడేళ్ల నుంచి యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చెట్టాపట్టాలేసుకుని తిరిగాడు. పెళ్లి చేసుకోమని యువతి అడిగితే మొదట్లో వాయిదా వేస్తూ వచ్చాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని చెప్పడంతో మోసపోయానని యువతి చాదర్‌ఘాట్ పోలీసులను ఆశ్రయించింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు 69 బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్, మద్యం దందా

- సింగరేణి కాలనీలో అసాంఘిక శక్తుల ఆగడాలు
- విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు, రోడ్లపై అమ్మకాలు
- మద్యం మత్తులో యువత ఘోరాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణికాలనీలో యథేచ్ఛగా సాగుతున్న గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, బెల్ట్‌షాపులలో మద్యం అమ్మకాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అడపాదడపా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తూ నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారు. మూడేళ్ల క్రితం సింగరేణి గుడిసెలలో గంజాయి మత్తులో నిందితుడు రాజు ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. అంతేగాకుండా తరుచుగా ఈ ప్రాంతంలో మత్తులో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు, దారిదోపిడీలు వంటి పలు సంఘటనలు చోటుచేసుకున్నాయి. సింగరేణి పరిసరాలలో విచ్చలవిడిగా దొరికే గంజాయి, డ్రగ్స్‌తో పాతబస్తీతో పాటు నగర శివారు ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఇక్కడి కొందరు యువకులు సైతం గంజాయి, డ్రగ్స్ లేనిదే ఉండలేని పరిస్థితికి చేరుతున్నారు. ఆ మత్తులోనే అసాంఘిక చర్యలకు, గొడవలు, దాడులు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. సింగరేణి పరిసరాలలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు బహిరంగంగా జోరుగా సాగుతున్నాయని, దీంతో ముఖ్యంగా యువత జీవితాలను నాశనం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బైక్, ఆటోల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్యాకెట్లను బట్టి రూ.50 నుంచి 200ల వరకు తీసుకుంటున్నారు. వీటిని తీసుకున్న యువకులు సిగరేట్లలో పెట్టుకుని పీలుస్తున్నారు. యువతతో పాటు కూలీలు, కొంతమంది మహిళలు సైతం గంజాయి, డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు (ఫైల్)

ఎనీటైం మద్యం అమ్మకాలు..

మద్యం దుకాణాలు రాత్రి 11గంటలకు మూసివేస్తుండడంతో బెల్ట్‌షాపుల వ్యాపారుల పంట పండుతున్నది. ముఖ్యంగా సింగరేణికాలనీ రోడ్లపై మందుబాబులతో జాతర సాగుతున్నది. ఇదే అదనుగా ఒక్కో బీరుకు రూ.వంద, క్వార్టర్‌కు రూ.50, ఫుల్‌బాటిల్‌కు రూ.200-300 అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే ఇదంతా కొందరు వైన్స్ దుకాణాల యజమానుల అండతోనే ముందస్తుగా మద్యం నిల్వ చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సింగరేణికాలనీ, ఖాజాబాగ్ బస్తీలలో ఎనీటైం మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సింగరేణికాలనీతో పాటు చింతల్‌బస్తీ, ఖాజాబాగ్ బస్తీలలో 100కు పైగా బెల్ట్‌షాపులు ఉన్నాయంటే పరిస్థితి ఊహించుకోవచ్చు.

చర్యలు చేపట్టండి: సీపీఐ

సింగరేణి కాలనీలో సాగుతున్న గంజాయి, మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరుతూ సీపీఐ నేతలు షేక్ మహమూద్, జంగయ్యతో పాటు పలువురు సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ అమ్మకాల వల్ల పిల్లలు, యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ కమిషనర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు. బెల్ట్‌షాపుల దందాతో సమీప కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి బెల్ట్ దందా నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకోవాలి.

-క్రాంర మోతీలాల్‌నాయక్, అధ్యక్షుడు, సేవాలాల్ బంజార సంఘం

డ్రగ్స్ అమ్మినా, కొన్నా కఠిన చర్యలు



నిషేధిత మత్తుపదార్థాలు, డ్రగ్స్ అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటాం. నిషేధిత మత్తు పదార్థాలు డ్రగ్స్, గంజాయి, ఎండీఎంఏ, హైరాయిన్, ఎల్ఎస్‌డీ, కొకైన్, బ్రౌన్‌షుగర్, ఎన్‌డీపీఎల్ లిక్కర్, నాటుసారా అమ్మినా, వాడినా రెండు నేరమే ముఖ్యంగా విద్యార్థులు, యువత డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఎవరైనా మత్త పదార్థాలు సేవిస్తున్నా.. విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా నంబరు 8712659641కు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు అత్యంత గోప్యంగా ఉంచుతాం. నిఘా పెట్టి డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం.

- జె. గోపాల్‌నాయక్, ఇన్‌స్పెక్టర్, మలక్‌పేట ఎక్సైజ్ స్టేషన్


ఖిల్లా మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కేక్ కట్ చేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్‌రెడ్డి



రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో బధిరులకు అన్నదానం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్


సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్

రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేస్తున్న రేవంత్‌రెడ్డి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి
- ఘనంగా రేవంత్ పుట్టినరోజు వేడుకలు

సరూర్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధికి కొత్త బాటలు వేస్తూ, ప్రజా పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. మరో పదేళ్ల పాటు ఆయనే రాష్ట్రానికి సీఎంగా కొనసాగనున్నారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం బడంగ్‌పేట్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్థానికులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిపై స్పష్టమైన అవగాహనతో సీఎం అడుగులు వేస్తున్నారని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆయన వెనకడుగు వేయబోరని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, బాలూనాయక్, ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, పార్టీ నాయకులు చప్పిడి సంతోష్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, బాల్‌నింగని జంగయ్య, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, నయనాచారి తదితరులు పాల్గొన్నారు.


బడంగ్‌పేట్‌లో సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కాంగ్రెస్ నేతలు


పూజలు నిర్వహిస్తున్న రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి


చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, టీపీసీ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ మిద్దెల జితేందర్

ఖిల్లా మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్బీనగర్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును ఆర్‌కేపురంలోని ఖిల్లా మైసమ్మ ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, మాజీ కౌన్సిలర్ ఢకియార్‌నాయక్, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ కూంచారపు సురేంద్రకుమార్(సురేష్), గట్ల రవీంద్ర, తలాటి రమేష్‌నేత, అల్లేటి కిరణ్‌కుమార్, నానవాల జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దపూర సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చాదర్‌ఘాట్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ మలక్‌పేట సలీంనగర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమంలో చిన్నారులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటు సీఎం రేవంత్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూసారాంబాగ్, చావునీ, ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపుర డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, షాహిద్, షకీల్, రాహుల్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

చంపాపేట : సీఎం పుట్టిన రోజున పురష్కరించుకొని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్‌తో కలిసి పండ్లు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో సీఎం పుట్టిన రోజు సందర్భంగా నల్ల రఘుమారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ డైరెక్టర్లు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, చీర తిరుమలేష్, హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, నిషికాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చింటూ, గౌతంరెడ్డి, భాగ్య, సరిత పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ : సీఎం పుట్టిన రోజును పురస్కరించుకుని రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తించాలి

కొత్తపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ సూచించారు. బాలాపూర్ బాలాజీనగర్ టౌన్‌షిప్‌లోని ఎడిఫై స్కూల్ నుంచి శుక్రవారం 67మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్ వద్ద ఉన్న రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి అందరూ ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని ఇన్‌స్పెక్టర్ అన్నారు. కార్యక్రమంలో టీటీఐ విశ్రాంత అధికారి అమరవర్ధన్‌రెడ్డి, హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

బాలికపై అఘాయిత్యం

సైదాబాద్ : బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బతుకుదెరువు కోసం ఓ తల్లి ఇద్దరు కూతుళ్లతో కలిసి సైదాబాద్ పీఎస్ పరిధిలోని ఓ బస్తీలో నివాసముంటున్నది. వీరి దగ్గరి బంధువైన యువకుడు(20)తో బాలిక(14) ప్రేమలో పడింది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడి శారీరక సంబంధానికి దారి తీసింది.

దీంతో బాలిక గర్భం దాల్చింది. కూతురు అనారోగ్యానికి గురవడంతో తల్లి నిలదీయగా అసలు విషయం వివరించింది. ఈమేరకు బాలిక తల్లి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అత్తపై అత్యాచారం చేసిన అల్లుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ : మత్తుమందు ఇచ్చి అత్తపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్న అల్లుడు మొహమ్మద్ షాకేర్‌ను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన షాకేర్ అత్తకు కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి స్పృహ కోల్పోయాక ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు షాకేర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా ఛట్ పూజలు

మన్సూరాబాద్ : మానవ కళ్యాణ్ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మన్సూరాబాద్ పెద్దచెరువు కొలను వద్ద నార్త్ ఇండియా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ఛట్ పూజను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకకు స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి విచ్చేసి వారితో కలిసి నార్తన్ సంప్రదాయ పద్ధతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ నేపాల్‌లోని పలు ప్రాంతాలతో పాటు దేశంలోని ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో ప్రతి ఏటా కార్తీక మాసం 6వ రోజు నుంచి ఛట్ పూజలు చేస్తుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మనోహర్‌సింగ్, కైలాష్‌సింగ్, రాజ్‌కుమార్ పాండే, ఆర్‌కే కటారియా, ఉమేష్‌గుప్తా, రాజీవ్‌వర్మ పాల్గొన్నారు.

మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: జేడీ

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని మార్కెటింగ్ శాఖ హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం మార్కెట్ వ్యాపారులకు హామీనిచ్చారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన ఆయనకు అగ్రిట్రేడర్లు, వ్యాపారులు మార్కెట్‌లో డ్రైనేజీ సమస్య గురించి ఫిర్యాదు చేశారు. మార్కెట్‌లో తరచూ డ్రైనేజీ మురుగు పొంగి రోడ్లు, షాపులముందు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతుందని రైతులు, మార్కెట్‌కు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాపారం చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన జేడీ మార్కెట్‌లో డ్రైనేజీ పారుతున్న ప్రాంతాన్ని మార్కెట్ అధికారులు, వ్యాపారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ అధికారులు దామోదర్, చిలుక నర్సింహారెడ్డి, అగ్రిట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, శ్రీనివాస్ ఉన్నారు.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. రెండ్రోజుల పాటు జరిగిన ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్-12, సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో 300 మందికి పైగా పాల్గొన్నారు. విజేతలకు గాడియం స్కూల్ డైరెక్టర్ కీర్తి రెడ్డి, తెలంగాణ జిమ్నాస్టిక్స్ సంఘం కార్యదర్శి సోమేశ్వర్ పతకాలు ప్రదానం చేశారు.

27 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో లారీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 27 టన్నుల రేషన్ బియ్యాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుర్మాయిగూడలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు లారీ డ్రైవర్ బాలాజీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఎల్బీనగర్‌కు చెందిన ఫయాజ్ ఆదేశాలతో తాను బియ్యాన్ని తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. దీంతో లారీతో పాటు డ్రైవర్ బాలాజీని, 27 టన్నుల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫయాజ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీల్లో బ్యాటరీలు, డీజిల్ చోరీ

- మునగనూర్‌లో రెచ్చిపోయిన దొంగలు

హయత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మునగనూర్‌లో పార్క్ చేసిన లారీల నుంచి పెద్దఎత్తున బ్యాటరీలు, లారీ జాకీలు, డీజిల్, టైర్లు, డిస్కులు అపహరించుకుపోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మునగనూర్ ప్రారంభంలో గ్రామానికి చెందిన దోమలపల్లి దర్శన్‌కు చెందిన లారీల పార్కింగ్ ఉంది. గురువారం పార్కింగ్ స్థలంలో సుమారు 20వరకు లారీలు, జేసీబీలు, హిటాచీలు పార్క్ చేశారు. అర్ధరాత్రి 1 గంట వరకు అక్కడే ఉండి ఆ తర్వాత యజమాని, డ్రైవర్లు ఇంటికి వెళ్లారు. రాత్రి 2 గంటల నుంచి మూడు గంటల మధ్యలో గుర్తు తెలియని దుండగులు 16 లారీ బ్యాటరీలు, 15 లారీలలో ఉన్న డీజిల్, ఒక్కొక్క లారీలో సుమారు 150 లీటర్ల వరకు ఉంది.. 16 లారీ జాకీలు, వీల్ పానాలు, డిస్కుల తో కలిసి ఐదు లారీల టైర్లు అపహరించుకుపోయారు. బాధితుడు శుక్రవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీజిల్ ట్యాంకుల స్క్రూలు విప్పి మరో ఇంజన్ సహాయంతో డీజిల్ కాజేసి ఉంటారని బాధితుడు దర్శన్ తెలిపారు. గతంలోను ఆరు లారీలకు చెందిన 12 బ్యాటరీలు అపహరించుకుపోయారని ఆయన తెలిపారు. తొర్రూర్, మునగనూర్, కట్ట మైసమ్మ కాలనీల సమీపంలోనే ఇలాంటి దొంగతనాలు తరుచూ జరుగుతున్నాయని దర్శన్ తెలిపారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని ఆయన కోరారు. దొంగలను పట్టుకుని నాకు న్యాయం చేయాలని కోరారు.


తెరిచి ఉన్న లారీ డీజిల్ ట్యాంక్